సమస్యల్లో కుండిశేకుగూడ

- కనీస వసతులు కరువు
- అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని గిరిజనుల తీర్మానం
- గ్రామ ముఖ ద్వారం వద్ద బ్యానర్ ఏర్పాటు

గాదిగూడ మండలంలోని కుండిశేకుగూడ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో మొత్తం 200పైగా ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయి. సమస్యలు పరిష్కరించాలని గతేడాది గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమింపజేశారు. తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నం చేశారు. రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక సర్వే చేయించినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - నార్నూర్



కలెక్టర్‌కు విన్నవిస్తున్న గ్రామస్తులు (ఫైల్)



కుండిశేకుగూడకు వెళ్లే రోడ్డు దుస్థితి

గ్రామ సమస్యలు ఇవే..

- గాదిగూడ మండలంలోని కుండిశేకుగూడ గ్రామంలో తాగునీటి కొరత ఉంది. మిషన్ భగీరథ నీరు రావడం లేదు.
- గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో 108, 102 వాహనాలు వెళ్లలేని పరిస్థితి.
- సరైనా సమయంలో వైద్యం అందకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన పరిస్థితి. మరి కొంత మంది ప్రాణాలు కోల్పోయారని గ్రామస్తులు తెలిపారు.
- సరైనా పాఠశాల భవనం లేదు. ఉపాధ్యాయులు సరిగా పాఠశాలకు రారు. గ్రామంలో డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోంది.

గ్రామస్తుల తీర్మానం..

పాలకులు, ప్రజాప్రతినిధులు గ్రామానికి వచ్చి ఓట్లు అడగవద్దని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని కుండిశేకుగూడ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామముఖ ద్వారం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. అధికారులు రోడ్డు, మౌలిక వసతులు కల్పించే వరకూ ఎన్నికల్లో పాల్గొనబోమని స్పష్టం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. రోడ్డు, తాగునీరు వసతి కల్పించాలని గత మూడేళ్లుగా గ్రామస్తులందరూ పోరాటం చేస్తున్నారు. గ్రామం నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర చేశాం. అప్పుడు అధికారులు హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదు.
– పుస్నాక నాగోరావు, కుండిశేకుగూడ

మా బాధలు పట్టించుకోండి



మా ఊరికి బాధలను పట్టించుకోవాలి. ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదు. బజారు వెళ్లాలంటే 16 కిలో మీటరు కాలినడకన వెళ్లాలి. గర్భిణులు, బాలింతల పరిస్థితి దారుణంగా ఉంది. అధికారులు పట్టించుకోవాలి.
– బాదిరావు, కుండిశేకుగూడ

ఎన్నికలను బహిష్కరిస్తాం



గ్రామ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదు. కనీస గ్రామాన్ని ఒక రోజు కూడా సందర్శించలేదు. పని చేయని వారికి ఓటు ఎందుకు వేయాలి. సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు వేస్తాం. లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం.
– కుమ్రం భీంరావు, కుండిశేకుగూడ

గోస పడుతున్నాం



మా గ్రామానికి రోడ్డు లేదు. ఏదైనా గ్రామానికి వెళ్లాలంటే కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రికి వెళ్లాలంటే 15 కిలో మీటరు నడవాలి. మా గోసను పట్టించుకునే వారే లేరు. ఓట్ల కోసం వచ్చే నాయకులు సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రావడం లేదు.
– కుర్సెంగ జైతు, కుండిశేకుగూడ

క్లుప్తంగా

ఎమ్మెల్యే రామన్నకు నిరసన సెగ

జైనథ్: మండలంలోని గిమ్మ, కోర్ట, ఆకోలి, కేదర్‌పూర్ గ్రామాల్లో బుధవారం రాత్రి ఆదిలాబాద్ ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. కోర్ట గ్రామస్తులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్ట గ్రామంలో 217 ఇళ్లు మంజూరు చేసి, ఎన్నికల తర్వాత తప్పకుండా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

ఎంపీ ప్రభాకర్‌పై దాడి సరికాదు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: దుబ్బాక నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి ప్రభాకర్‌పై కత్తితో దాడి చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. బుధవారం ఆర్డీవో జీవాకర్ రెడ్డికి వినతిపత్రం అందచేశారు. దాడి వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ధరణి రాజేశ్, ప్రభాకర్, తిరుపతి, మహేందర్, షేక్ హైమద్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: దుబ్బాక నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి ప్రభాకర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఈదాడిలో ప్రతిపక్ష పార్టీల నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు జాదవ్ లఖన్, కోవ రాజేశ్వర్, మడావి భీంరావ్, శ్రీనివాస్, గణేష్, శివాజీ, ఆరెల్లి రాందాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాపూరావును కలిసిన నాయకులు

బోథ్: బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు బుధవారం బీజేపీలో చేరిన సందర్భంగా స్థానిక బీజేపీ నాయకుడు వెండి సోమేశ్వర్ ఢిల్లీలో ఆయను మరాద్య పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఇచ్చోడ మాజీ జెడ్పీటీసీ అశోక్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తలమడుగు: మండలంలోని కుచులాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని మహిళా నాయకురాలు సునీత రెడ్డి, పల్లవి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశ్, నాయకులు అభిరామ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, సర్పంచ్ ప్రభ దేవరావు, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోనీ 34వ వార్డు శాంతినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గత పదేళ్లలో అన్నిరంగాల్లో గణనీయ పురోగతి సాధించామన్నారు. కాంగ్రెస్, బీజేపీల హయాంలో ప్రజలు ఇబ్బంది పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, కొమ్ము కృష్ణ, సయ్యద్ మోసిన్, సర్సా గౌడ్, ఇబ్బు పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి



భీం వర్ధంతిలో పాల్గొన్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: కుమురం భీం 83వ వర్ధంతిని బుధవారం మావల మండలంలోని కేఆర్కే కాలనీలోని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మావల మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ హాజరయ్యారు. భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా.. ఆదివాసీల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఆత్రం గణపతి, వెడ్మ ముకుంద్ రావ్, శాంతబాయి పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మండల వైద్యాధికారి రాహుల్ గడపాలేకు, మిట్టపల్లి శ్రీకాంత్‌లకు పీజీలో సీట్లు రావడంతో బుధవారం పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. రాహుల్‌కు పీజీ జనరల్ సర్జరీ విభాగంలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో, మిట్టపల్లి శ్రీకాంత్ గాంధీ మెడికల్ కాలేజీలో రేడియాలజీ విభాగంలో సీటు సాధించారు. కార్యక్రమంలో డాక్టర్ దేవోల శ్రీనివాస్, డాక్టర్ కాస్తాల చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు వసంత, శ్యామల, బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, కొడప యశోద, మర్సకొల లక్ష్మీ బాయి, స్టాఫ్‌నర్స్ గంగామణి, ల్యాబ్ టెక్నిషన్ మడావి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



కాంగ్రెస్ మేనిఫెస్టో వివరిస్తున్న శాంతికుమారి

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్లమెంట్ పరిశీలకురాలు పాచిపెంట శాంతికుమారి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మాలేబోరిగాం, చిన్న మాలేబోరిగాం, ధర్మగూడ, కేబీ కాలనీ, జెండాగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులైన వారికి రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు ప్రతీ నెల రూ. 2,500, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, ఆదివాసీ కాంగ్రెస్ విభాగం జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావ్, గ్రామ పటేళ్లు సెడ్మకి రాము, మడావి శ్యాం, సెడ్మకి భీంరావ్, మెస్రం తులసీరాం పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముత్నూర్, కేస్లాపూర్, ఏమాయికుంటా, అందునాయక్‌తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు జహిర్, కొమురయ్య, పద్వాల్ జగన్‌సింగ్, జితేందర్, మెస్రం నాగ్‌నాథ్, చహకటి మానిక్‌రావ్, ప్రశాంత్, మీర్జా యాకుబ్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

ఉట్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని సుద్దగూడలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుమురం సూరు వర్ధంతి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్ మండలం కొలాంగూడ దంతన్‌పల్లిలో ఈనెల 4న నిర్వహించే కుమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని వర్ధంతి కార్య నిర్వహణ కమిటీ కన్వీనర్ కుమ్రం రాజు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పీవీటీజీలకు ఉన్నత విద్య నిమిత్తం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. తక్షణ సాయం కింద రూ. 25వేల ఆర్థిక చేయూతను అందించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో కార్యనిర్వాహణ కమిటీ కోకన్వీనర్ టేకం భీము, నాయకులు సిడాం రాము, కొడప లక్ష్మణ్ పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామానికి చెందిన నరేశ్‌కు రక్తం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో స్పందించి బేల మండలం సాంగిడి గ్రామానికి గంగన్న అనే యువకుడు రక్తదానం చేశాడు.

ఆదివాసీల సంక్షేమానికి పెద్దపీట

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివాసీ పర్దాన్ సమాజ్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులు, బేల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివాసీ పోరాటయోధుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల బూటక హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. కార్యక్రమంలో నగేశ్, జంగు పటేల్, మెట్టు ప్రహ్లాద్, సలీం పాషా, రామేశ్వర్, ప్రకాష్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఉంటేనే సంక్షేమ పథకాలు అమలు

జైనథ్: సీఎం కేసీఆర్ ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని భోరజ్, సిర్సన్న, గూడ, రాంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు బైక్ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్, బీజేపీలు సంక్షేమ ఫలాలు ప్రజలకు అందకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 3వేల జీవన భృతి, అందరికీ రూ. 5 లక్షల బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు సర్సన్ లింగారెడ్డి, వేణు యాదవ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజల సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్, ఖానాపూర్, ఆదర్శనగర్, ఖోజకాలనీ, ఆదర్శనగర్, మహాలక్ష్మివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగారెడ్డి, ఎజాజ్, విలాస్, రత్నకిషోర్, మల్లేష్, గీత, సురేశ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



ఓటు అభ్యర్థిస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండలంలో జామిడి, నర్సాపూర్, సిరిచెల్మ, మండల కేంద్రంలో ఇంస్లాంపూర, రంజాన్‌పూర కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. గెలిచిన వెంటనే సిరిచెల్మ నుంచి పెంబి వెళ్లే రోడ్డును మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచులు మోహరాజ్ అహ్మద్, గాడ్గే సుభాష్, పాండురంగ్, హరన్ సుభాష్ పటేల్, మాజీ జెడ్పీటీసీ కృష్ణకుమార్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, నాయకులు నానక్ సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, సురేందర్, అడెల్లు, లచ్చన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బోథ్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పిప్పల్‌ధరి సర్పంచ్ బండారి శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని కోరారు. అలాగే జీడిపల్లె, హనుమాన్ తండా గ్రామాల్లో ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్ ప్రచారం నిర్వహించారు. రైతులకు పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

తగ్గిన సోయా దిగుబడి

- నియోజకవర్గంలో 42 వేల ఎకరాలలో సాగు
- ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే
- ఆందోళనలో రైతులు

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు ప్రతీ ఏడాది ఏదో రూపంలో నష్టం జరుగుతునే ఉంది. ఈఏడాది అనావృష్టి వల్ల (అధిక వర్షాలు) సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన అధిక వర్షాలతో సోయాబీన్ పంట దిగుబడిపై ప్రభావం పడిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు రబీలో సాగు చేసే శనగ, జొన్న పంటలపై ఆశ పెట్టుకున్నారు.

దిగుబడి అంతంత మాత్రమే..

ఈఏడాది వానాకాలంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్ మండలంలో 7 వేల ఎకరాలు, జైనథ్ మండలంలో 25 వేల ఎకరాలు, బేల మండలంలో 10,500 ఎకరాలు, మావల మండలంలో 200 ఎకరాల్లో సోయాబీన్ పంట సాగైంది. వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కానీ సెప్టెంబర్, అక్టోబర్ మాసంలో కురిసిన భారీ వర్షాలకు పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో దిగుబడిపై ప్రభావం పడి ఎకరానికి కేవలం 6 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చిందని అన్నదాతలు పేర్కొంటున్నారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

రబీపైనే ఆశలు..

సోయాబీన్ సాగుచేసిన ఆదిలాబాద్ నియోజకవర్గంలో రైతులు ప్రతీ ఏడాది రబీ సాగు చేస్తారు. శనగ, జొన్న పంటలు వేసుకుంటారు. సోయాబీన్ పంట దిగుబడి రాకపోవడంతో రబీపై ఆశలు పెట్టుకున్నారు. రబీలోనైనా దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తే కొంత ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు.



ఆరబెట్టిన సోయా పంట

చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళ సాధికారత అవశ్యకత, ఫోక్సో చట్టం, సేఫ్‌టచ్ అన్ సేఫ్‌టచ్, బాల్యవివాహాలు, సైబర్ క్రైం గురించి వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత మిషన్ జిల్లా కోఆర్డినేటర్ యశోద, కేంద్రం సిబ్బంది కోటేశ్వర, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

నేరడిగొండ: ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ప్రతీ బుధవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. డాక్టర్ కల్యాణం రవీందర్, ఐఈడీ రిసోర్స్ పర్సన్‌లు సుకన్య, సంధ్యారాణి పాల్గొన్నారు.